
ఎర్రవల్లిలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు


బైరంపల్లిలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అయిజలో వినాయక మండపం వద్ద భజన చేస్తున్న భక్తులు


అమరవాయిలో అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

బొజ్జ గణపయ్యకు ఘనంగా పూజలు

జిల్లాలో వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లా, మండల, గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక మండపాల వద్ద భజనలు, కీర్తనలు, బొడ్డెమ్మలు వేశారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. మానవపాడు మండలంలోని అమరవాయిలో వినాయకుడి నిమజ్జనం చేశారు. - సాక్షి, నెట్‌వర్క్

క్లుప్తంగా

సొంత డబ్బులతో డ్రెయినేజీ నిర్మాణం



అయిజ: మండలంలోని ఉప్పల గ్రామంలో సొంత ఖర్చులతో డ్రెయినేజీ నిర్మాణం, రోడ్డు గుంతలకు మరమ్మతులు చేసిన బీజేపీ కార్యకర్త శంకరన్నను బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి శాలువాతో సత్కరించారు. మండలంలోని బింగుదొడ్డిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మన్న, మల్లేష్, శివన్న, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి మోటారు లభ్యం



మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మూత్రశాలలో నీటిని పంపు చేసే మోటారును ఎవరో ఉంచారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ మోటారును ఎవరూ గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని మూత్రశాలలో పెట్టినట్లు తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ చేయాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం



మానవపాడు: రోబోయే గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని జిల్లా డీసీసీ కాంగ్రెస్ మెంబర్ మహ్మద్ సిరాజ్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని అమరవాయిలో రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా దాదాపు 1487 కొత్త రేషన్ కార్డులను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 10 ఏళ్ల అధికారంలో ఉన్న పేదలకు రేషన్‌కార్డులను అందించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఆర్ఐ రవితేజ, నాయకులు పరమేష్‌నాయుడు, తేజేశ్వర్‌గౌడ్, గణేష్, నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి



అయిజ: మండలంలోని అనేక ప్రదేశాల్లో కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామ శివార్లలో అనేక చోట్ల కల్వర్టులు, బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమయ్యాయని, కొన్ని ప్రదేశాల్లో పునర్ నిర్మాణం పనులు చేపట్టినా, అవి ముందుకు సాగడంలేదని అన్నారు. మేడికొండ రోడ్డు మార్గంలోని పోలోనివాగుపై నిర్మించితలపెట్టిన బ్రిడ్జి పనులు నిలిచాయని తెలిపారు. ఉత్తనూరు–తొత్తినోనిదొడ్డి గ్రామాల మధ్యన ఉన్న వాగుపై కల్వర్టును నిర్మించకపోవడం వల్ల వర్షం కురిసిన ప్రతిరోజు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమసేన రావు, లక్ష్మణ్ గౌడ్, శంకరన్న, రాముడు, భీసన్న పాల్గొన్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం


సుంకేసుల డ్యాంపై రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న పోలీసులు

- పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- డ్యాముకు వెళ్లే రోడ్డుపై తాత్కాలిక మరమ్మతు
- డ్యాం దగ్గర రక్షణ కంచె ఏర్పాటు
- ఏర్పాట్లను గాలికొదిలేసిన ఏపీ ప్రభుత్వం

రాజోళి: గణనాథుడి నిమజ్జనానికి పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉంటున్నారనేది ప్రధాన ఘట్టంగా మారింది. కొన్నేళ్లుగా రాజోళి, వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు తదితర మండలాల్లోని పలు గ్రామాల నుంచి వినాయక నిమజ్జనం రాజోళి శివారులోని సుంకేసుల డ్యాం దగ్గర చేస్తుంటారు. కొన్నేళ్లుగా డ్యాం రోడ్డు దెబ్బతినడం, గడిచిన రెండేళ్లుగా డ్యాం దగ్గర ప్రమాదకర పరిస్థితులు ఉండటంతో నిమజ్జనం చేసేందుకు, అ క్కడికి వెళ్లడానికి పలువురు ఇబ్బందులు పడ్డారు.

పోలీసుల చొరవతో..

2009లో వచ్చిన వరదల కారణంగా సుంకేసుల డ్యాం రోడ్డు పూర్తిగా దెబ్బతింది. డ్యాంకు చేరుకునే రోడ్డుతో పాటు, కింది భాగంలో ఉన్న రోడ్డు కూడా పూర్తిగా గుంతలమయంగా మారింది. డ్యాంపై రోడ్డు అధ్వానంగా ఉండటంతో పాటు, డ్యాంకు స్టోరేజీ వైపు, గేట్ల నుంచి నీటి విడుదలయ్యే దగ్గర కూడా కనీసం రక్షణ చర్యలు లేకపోవడంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల చొరవతో...

అలంపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి రాజోళి శివారులోని సుంకేసుల డ్యాంకు వినాయక నిమజ్జనం చేసేందుకు వందల సంఖ్యలో వాహనాలు, వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఏపీ ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం పోలీసులు డ్యాం మొదలయ్యే దగ్గర నుంచి గుంతల రోడ్డుకు మట్టి వేసి తాత్కాలిక మరమ్మతు చేయడం, డ్యాం దగ్గర కూలిన రక్షణ కంచెల స్థానంలో తాత్కాలికంగా రక్షణ, అప్రమత్తత చర్యలు తీసుకుని భక్తులకు భరోసా కల్పిస్తున్నారు. వినాయక చవితి నుంచే పోలీసు పహారా ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. పోలీసులు నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, డ్యాంలో నిమజ్జనం చేసే సందర్భంలో నిర్వాహకులు కూడా భద్రత చర్యల్లో భాగంగా తమ వెంట వచ్చే వారికి పలు జాగ్రత్తలు చెప్పాలని పోలీసులు సూచించారు.

ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం..

సుంకేసుల డ్యాం పూర్తిగా ఏపీ పరిధిలోనే ఉంది. కాని నేటి వరకు దానిపై అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవు. డ్యాం నిర్మాణం తర్వాత, రాష్ట్ర విభజన అనంతరం కనీసం మట్టి కూడా వేయలేదు. 2009లో కూలిన రక్షణగోడలను కూడా నిర్మించని చంద్రబాబు ప్రభుత్వం భక్తుల భద్రతకు చర్యలు ఏమి చేపడుతుందని ప్రశ్నిస్తున్నారు.

కొన్నేళ్లుగా చర్యలు శూన్యం



15 ఏళ్లకు పైగా వినాయక చవితి నిర్వహిస్తున్నాం.డ్యాం రోడ్డుపై విగ్రహం తీసుకెళ్లాలంటే చాలా భయంగా ఉండేది. ప్రస్తుతం డ్యాంకు వెళ్లే రోడ్డుపై మరమ్మతు చేయడం చేయడం హర్షనీయం. ఏపీ ప్రభుత్వం డ్యాంలో నిమజ్జనం చేసే సమయంలోనైనా రక్షణ చర్యలు చేపట్టాలి.

– వీరేష్ గౌడ్, డ్రైవర్–ఓనర్ అసోసియేషన్,శాంతిగనర్

భక్తులకు ఇబ్బంది కలగకూడదనే...



కారణాలు ఏవి ఉన్నా భక్తులకు ఇబ్బంది కలగకూడదనేది మా అభిమతం. రోడ్డుపై గుంతల వల్ల వాహనాలు ఒక పక్కకు ఒరగడం, విగ్రహాలు కిందపడటం, భక్తులకు గాయాలు అవుతున్నాయి. అందుకే గుంతలను మట్టితో పూడ్చివేయించాం. భద్రతా చర్యలు తీసుకున్నాం. మేము ఎన్ని చర్యలు తీసుకున్నా నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలి.

– టాటాబాబు, సీఐ, శాంతినగర్ సర్కిల్

ఇటిక్యాలలో ఘనంగా టీఎల్ఎం మేళా


ఇటిక్యాలలో టీఎల్ఎంను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

ఎర్రవల్లి: ఇటిక్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్–టీఎల్ఎం మేళా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్ విభాగాలలో తమ ప్రతిభను కనబర్చారు. ప్రతిభను కనబర్చిన ఉపాధ్యాయులు కృష్ణ, రాధమ్మ, కరుణాకర్, అనూహ్య, సురేష్, ప్రణీత, మానస, దయాకర్, రవికుమార్, రేష్మబేగంలను వారు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాగుంటన్న, డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


అమరవాయిలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం నరేష్

మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీ హెచ్ఎస్‌లో వినాయక చవితిని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వినాయకచవితి ప్రాముఖ్యతను తెలిపే వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం నరేష్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విష్ణు, అక్షితుడు, అనిత, రుషిరాజు, ధనుంజయ, ఆనంద్, సరిత, రవి, వీరన్న పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

శాంతినగర్: బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా, మండల కేంద్రాల్లో రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో వడ్డేపల్లి బీజేపీ నాయకులను శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల్లో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలు తగల బెడతారనే విషయం తెలియడంతో ఆపార్టీ టౌన్ ప్రసిడెంట్ రామకృష్ణ, మండల అధ్యక్షుడు నాగరాజులను శాంతినగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రధాని నరేంద్రమోదీ తల్లిని రాహుల్‌గాంధీ తీవ్ర పదజాలంతో దూషించినట్లు పేర్కొన్నారు.


శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


పాతపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివరంగాపురం పాఠశాలలో సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని శనివారం విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలాఉంది అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులు తినే భోజనం వండే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వారానికి మూడు గుడ్లు అందించాలని పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు కల్పించాలని, విద్యార్థులను ఆన్‌లైన్‌లో నమోదే చేయాలన్నారు. టెక్స్‌బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్‌లన్నింటిని నమోదు చేయాలని ఎఫ్ఏ మార్కులు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ పాపయ్య, హెచ్ఎంలు రాఘవేంద్ర, సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు శనివారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కోతులగిద్ద గ్రామంలోని ప్రాథమిక, మార్లబాడు రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించారు. పాఠశాల రికార్డులను, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్ 100 శాతం పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ పథకాలు


జింకలపల్లిలో ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాయకులు

ఎర్రవల్లి: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని వల్లూరు, జింకలపల్లి, తిమ్మాపురం, యాక్తాపురం, తదితర గ్రామాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జోగులరవి, మద్దిలేటి, నర్సింహులు, భాస్కర్‌రెడ్డి, శ్యామ్, ఆదాం, రాజు పాల్గొన్నారు.

జాబితాలో డబుల్ ఓటర్లను తొలగించాలి


ఇటిక్యాలలో మాట్లాడుతున్న అజార్ మొహియుద్దీన్


వడ్డేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

అలంపూర్ రూరల్/ఇటిక్యాల/శాంతినగర్/మల్దకల్/: అలంపూర్ ఎంపీడీఓ పద్మావతి అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 17,375మంది ఓటర్లు ఉన్నారని, సర్పంచు, ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి 120 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో రాజు, ఈదన్న, పెద బాబు, ఈశ్వర్, నరసింహ, జానయ్య, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

■ ఇటిక్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలను తెలియజేయాలని ఎంపీడీఓలు అజార్ మొహియుద్దీన్, అబ్దుల్ సయ్యాద్ ఖాన్ లు కోరారు. చనిపోయిన ఓటర్లను సైతం తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

■ వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ అధ్యక్షతన అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. కుటుంబ సభ్యులకు సంబంధించిన అందరి ఓట్లు ఒకే వార్డులో ఉండాలని కోరారు.


మల్దకల్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

■ మల్దకల్ మండలంలోని ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ నర్సన్న, నాయకులు తిరుపతిరెడ్డి, బంగి గోవిందు, వీరేష్ గౌడ్, సురేందర్ బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు


కలుకుంట్లలో పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఇటిక్యాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మానవపాడు/ఇటిక్యాల: సమాజంలో ఎవరి హక్కులకు భంగం కల్గించొద్దని ఆర్ఐ గురురాజ్, హాస్టల్‌వార్డెన్ రాము తెలిపారు. శనివారం మండలంలోని కలుకుంట్లలో పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఇటిక్యాల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇన్‌చార్జి అలీ, నాయకులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

■ ధరూరు మండలంల మార్లబీడులో తహసీల్దార్ నరేందర్ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అంటరానితనం పాటించినా, హోటళ్లలో రెండు గ్లాసుల విధానం పాటించినా చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటగామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్


అమరవాయిలో బాధితుడితో మాట్లాడుతున్న గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

మల్దకల్: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎర్రన్న అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొంది శనివారం ఇంటికి చేరాడు. విషయం తెలుసుకున్న గద్వాల జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత బాధితుడిని పరామర్శించారు.ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు తిరుమల్, శ్రీనివాస్‌గౌడు, పెద్దపల్లి రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, లక్ష్మన్, ఆంజనేయులు, తిప్పన్న, రాముడు, హన్మంతు, రామన్న, భాస్కర్ ఉన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

గద్వాల: ధరూరు పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సభ్యులు రాఘవేంద్ర కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఖాళీ పేపర్లపై సహకార సభ్యులతో సంతకాలు తీసుకుంటున్న సీఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను లారీలలో తరలిస్తున్న రెండు లారీలు పుల్లూరు శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్లు అలంవల్లి, జగదీశ్, ఓనర్లు రాజోళి కార్తిక్ రెడ్డి, సుదీప్ కుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

జిల్లా కోర్టును పీజేపీ క్యాంపులోనే నిర్మించాలి


పౌరస్పందన సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

గద్వాల: జిల్లా కోర్టు సముదాయాన్ని జిల్లా కేంద్రంలోని పీజేపీ క్యాంపులోనే నిర్మించాలని అఖిల పక్షం సంఘాల నాయకులు, న్యాయవాదులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో పౌరస్పందన సదస్సు నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పీజేపీ క్యాంపులో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మోహన్‌రావు, ప్రభాకర్, రాజశేఖర్‌రెడ్డి, నర్సింహులు, ఇక్బాల్ పాష, నర్సింహా, పూజారి గోపాల్‌రావు, అచ్చన్నగౌడ్ పాల్గొన్నారు.

బీచుపల్లిని సందర్శించిన టాలీవుడ్ నటుడు


బీచుపల్లిలో సహాయక నటుడు శ్రీనివాసులు

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని శనివారం టాలీవుడ్ సహాయ నటుడు శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైశ్య సంఘం నాయకులు సురేష్, తదితరులు ఉన్నారు.